ఈనాడు స్థిరాస్తి

# అందరి చూపు.. మన మెట్రో వైపు!



**'అసలే తక్కువ విస్తీర్ణం రోడ్లు.. పైగా వందలాది వాహనాలు.. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు.. ఇలాంటి పరిస్థితుల్లో నడిరోడ్డు మీద పిల్లర్లు వేసి మెట్రోను నిర్మించడం కుదిరే పనేనా? ప్రపంచంలో ఎక్కడా ఆకాశమార్గంలో కట్టనే కట్ట లేదు.. ఇక్కడెలా సాధ్యమవుతుంది? చూస్తూ ఉండండి.. నిర్మాణ పనులు అలా మొదలవుతాయో లేదో ఇలా ఆగిపోతాయి..'**



మెట్రో రైలు గురించి మొదట్లో విన్పించిన మాటలివి. అలాంటి వాటన్నింటినీ ఓపికగా భరిస్తూ.. వివిధ సమస్యలకు పరిష్కారాల్ని చూపుతూ.. రకరకాల సవాళ్లను అధిగమిస్తూ.. ఇంజినీరింగ్‌లో వినూత్న పద్ధతుల్ని అనుసరిస్తూ ముందుకెళ్లాం. అందుకే మెట్రో ప్రాజెక్టు ప్రస్తుతం ఓ స్థాయికి చేరుకుందని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. నిర్మాణ పనుల్ని చేపట్టడానికి అనుసరించిన ప్రణాళికలు.. 2014లో మెట్రోకు సంబంధించిన లక్ష్యాల్ని 'స్థిరాస్తి'కి ప్రత్యేకంగా వివరించారు. సారాంశం ఆయన మాటల్లోనే..

'యుద్ధానికి వెళ్లే ముందు సైన్యం పకడ్బందీగా సన్నద్ధం అవుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. అదే విధంగా నగరంలో మెట్రో పనుల్ని యుద్ధప్రాతిపదికన చేయాలనుకున్నాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కట్టాలనుకున్నాం. కానీ, అది సులువైన విషయమేం కాదని అందరికీ తెలిసిందే. మెట్రో మొదలైతే నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని తెలుసు. కానీ, ఎక్కడ్నుంచి మొదలెట్టాలి? తీవ్రంగా ఆలోచించాం. నగరం నుంచి శివారు ప్రాంతాలకు బదులు.. శివార్ల నుంచి నగరానికి వచ్చేలా పనులు మొదలెడితే? ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఉప్పల్, మియాపూర్, నాగోలు వంటి ప్రాంతాలకు వెళ్లి పరిస్థితుల్ని పరిశీలించాం. కొన్ని చోట్ల రోడ్డు ఆక్రమణకు గురైంది. రోడ్లు వెడల్పు చేస్తే ప్రథమ అడ్డంకి తొలగినట్లేనని అన్పించింది. వెంటనే రూ.50 కోట్లు మంజూరు చేశాం. అడ్డదిడ్డంగా ఉన్న చెట్లను వేరే చోటికి శాస్త్రీయ పద్ధతుల్లో తరలించాం. నడిమధ్యలో పునాదులకు 8 అడుగుల స్థలాన్ని తీసుకున్నాం.

## స్థలం ఎక్కడ?

రోడ్డు విస్తరణ పనులైతే మొదలయ్యాయి.. మరి డిపోల ఏర్పాటుకు స్థలం కావాలి కదా? మూసీ నది ఒడ్డున 850 ఎకరాల గడ్డి భూములున్నాయని తెలిసింది. ఆ స్థల యజమానులతో మాట్లాడాం. హెచ్ఎండీఏతో కలిసి ప్రభుత్వాన్ని ఒప్పించి భూమిని సేకరించాం. డిపో కోసం 150 ఎకరాలు తీసుకున్నాం. మిగతా స్థలాన్ని హెచ్ఎండీఏ అభివృద్ధి చేసింది. అన్ని రకాల సౌకర్యాల్ని ఏర్పాటు చేసి.. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అందించింది. దీంతో భూముల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. మియాపూర్ స్థలానికి సంబంధించి కోర్టులో కేసు ఉండేది. కోర్టులో సుమారు రూ.200 కోట్లు జమ చేసి స్థలాన్ని తీసుకున్నాం. దీంతో రెండు డిపోలకు సంబంధించి స్థలం మా స్వాధీనంలోకి వచ్చింది.

## నిర్మాణమెలా?

ప్రధాన మార్గమధ్యలో కాంక్రీటు పోసి పిల్లర్లను కడితే రోడ్డును పూర్తిగా ఆక్రమించాల్సి వస్తుంది. ఇది వద్దనుకుని.. ఆధునిక పరిజ్ఞానం వైపు దృష్టి సారించాం. ప్రీ ఇంజినీర్డ్ తరహాలో చేపట్టాలన్న ఆలోచనకు వచ్చాం. ఉప్పల్, కుత్బుల్లాపూర్, మియాపూర్‌లలో సెగ్మెంట్లు తయారు చేసి.. వాటిని భారీ వాహనాలపై నగరానికి రాత్రిపూట తీసుకొచ్చి.. పిల్లర్లపై బిగించాలన్న నిర్ణయానికి వచ్చాం. ఇలా మూడు కారిడార్లలో వచ్చే 2,700 పిల్లర్లలో.. 960 పూర్తి చేశాం. ఒక్కో పిల్లరు నాలుగు వేల టన్నుల బరువు ఉంటుంది. ఇది 21 రకాల ఒత్తిళ్లను తట్టుకుంటుంది. సుమారు 1130 పునాదుల్ని పూర్తి చేయగలిగాం.

- రెండు పిల్లర్ల మధ్య పది సెగ్మెంట్లు ఉంటాయి. అలాంటివి ఇప్పటిదాకా 557 పూర్తి చేశాం. దాదాపు 32 కిలోమీటర్ల దాకా పునాదులు పూర్తయ్యాయి. వివిధ ప్రాంతాల్లో 27 కిలోమీటర్ల వరకూ పిల్లర్లు పూర్తయ్యాయి. 17 కిలోమీటర్ల మేరకు సెగ్మెంట్లు పూర్తి చేశాం. ఇంతమేరకు ట్రాక్ వేయడానికి సిద్ధంగా ఉంది. మొదటి విడతలో భాగంగా నాగోలు నుంచి మెట్టుగూడ దాకా ఎనిమిది కిలోమీటర్లలో ఏడు స్టేషన్లు వస్తాయి. ఇందులో ఒక కిలోమీటర్ పూర్తయ్యింది.

## స్టేషన్లు ఎలా?

'పిల్లర్లు వేశారు.. సెగ్మెంట్లు బిగించారు.. మరి స్టేషన్ ఎలా కడతారు' చాలామందిలో కొత్త సందేహం. ఇందుకోసం పక్షిని స్ఫూర్తిగా తీసుకుని.. ప్రీకాస్ట్ తరహాలో స్టేషన్‌ని ఏర్పాటు చేస్తున్నాం. మెట్లు, ఎస్కలేటర్, లిఫ్టు అన్నీ.. వస్తాయి. అసలిది ఇంజినీరింగుకే కొత్త సవాల్ లాంటిది. స్టేషన్లు చీకటిగా ఉండే సొరంగ మార్గంగా కాకుండా.. నలువైపులా సహజసిద్ధమైన వెలుతురు ప్రసరించేలా ఉంటుంది.

## ఈ ఏడాదిలో..

మే చివరి నాటికల్లా కొరియా నుంచి మూడు బోగీలు వస్తాయి. జూన్ నుంచి డిపోలో ట్రయల్ రన్ ఉంటుంది. ఆ తర్వాత ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు రైలు పట్టాలపై పరీక్షిస్తాం. రైల్వే భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అన్నీ పరీక్షలను విజయవంతంగా అధిగమించాకే.. 2015 ఉగాది నాటికి ప్రజల కోసం అందుబాటులోకి తెస్తాం. తర్వాతి ఆరు నెలల్లో మియాపూర్ నుంచి అమీర్‌పేట్ మొదలౌతుంది. ఇలా ఒక్కో పనిని పక్కాగా చేసుకుంటూ ముందుకెళతాం. ఢిల్లీ మెట్రో ఎనిమిదేళ్లల్లో 65 కిలోమీటర్లు రాకపోకలు సాగిస్తే, మన మెట్రో ఐదేళ్లల్లో 72 కిలోమీటర్లు అందుబాటులోకి వస్తుంది. మెట్రో రైళ్ల నిర్మాణంలోనే ఇదో చరిత్ర అని చెప్పొచ్చు. పాశ్చాత్య దేశాలన్నీ మన మెట్రో వైపు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. భారతదేశంలోనూ మెట్రో రైలు చేపట్టే రాష్ట్రాలూ ఇక్కడ జరిగే మెట్రో పనులను నిశితంగా పరిశీలిస్తున్నాయి. మన నాడే పరిజ్ఞానాన్ని చూసి ఆశ్చర్యపోతున్నాయి.'

- హైదరాబాద్ స్థిరాస్తి రంగానికి ప్రాణవాయువు అయిన మెట్రో రైలు మియాపూర్ డిపో పనులను 2013లో ఆరంభించారు. 2015 ద్వితీయార్థంలో మియాపూర్ నుంచి అమీర్‌పేట్ దాకా మెట్రోరైలు అందుబాటులోకి వస్తుంది.
- నదిఇసుకపై నిషేధం ఉండటం వల్ల మెట్రో నిర్మాణంలో రోబో ఇసుకను వాడుతున్నారు.
- ఏడు చోట్ల ఆర్ఎంసీ ప్లాంట్లను ఏర్పాటు చేశారు.
- భారతదేశంలోనే అతిపెద్ద క్యాస్టింగ్‌యార్డుకు ఉప్పల్ వేదిక అయ్యింది.
- ఈ ఏడాదిలోనే కొరియా నుంచి టికెట్ గేట్లను తెప్పిస్తు